ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సారపాక, డిసెంబర్ 28: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బూర్గంపహాడ్ పోలీసులు గురువారం పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో సమీపంలోని గోదావరి నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో దాడిచేసి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 28 : పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని గుంపెన శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంలో కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి, నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు పారిపోయారు. దాడిలో 5 సెల్‌ఫోన్లు, 1 ద్విచక్ర వాహనం, రూ.18 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై షాహీనా తెలిపారు.

భర్తపై వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేట, డిసెంబర్ 28 : భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దురదపాడు గ్రామానికి చెందిన పాయం జనార్ధన్‌రావు అతిగా మద్యం సేవిస్తూ భార్య తులసిని చిత్రహింసలకు గురిచేస్తూ వేధిస్తున్నాడు. దీంతో తులసి ఫిర్యాదుపై ఆమె భర్త జనార్ధన్‌రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చంద్రుగొండ, డిసెంబర్ 28 : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలో చోటు చేసుకున్నది. కుటుంబ సభ్యులు, పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. సీతాయిగూడెం గ్రామానికి చెందిన బన్నె రాంబాబు(30) మూడేళ్ల క్రితం భార్యతో విడాకులు జరిగాయి. దీంతో తల్లిదండ్రుల వద్ద ఉంటూ ట్రాక్టర్ నడుపుతున్న రాంబాబు మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంటి నుంచి ట్రాక్టర్ పనుల కోసం గొల్లగూడెం వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. గురువారం ఉదయం గ్రామ శివారులోని అటవీప్రాంతంలో శవమై కనపించాడు. రాంబాబు మృతదేహం వద్ద మద్యం, పురుగు మందు డబ్బాలు ఉండడమే కాకుండా మృతుడి నోటి నుంచి నురుగు వచ్చి ఉండడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై మాచినేని రవి, సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ..

అశ్వారావుపేట, డిసెంబర్ 28 : అనారోగ్య కారణాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన దొడ్డాకుల శ్రీదేవి(40) అనారోగ్య కారణాలతో బుధవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలి సోదరుడు దొడ్డాకుల కృష్ణ ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 28 : మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన చప్పిడి ముత్యాలరావు(40) బుధవారం ద్విచక్రవాహనంపై నారాయణపురం వెళ్తుండగా వాహనం అదుపు తప్పి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

గ్యాస్ సిలిండర్లు పట్టివేత

పాల్వంచ, డిసెంబర్ 28: పట్టణంలోని పలు హోటళ్లలో గృహోపకరణాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను వాడుతున్నారే ఆరోపణలపై సివిల్ సప్లై డీటీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. దమ్మపేట సెంటర్, పాల్వంచ, నవభారత్ తదితర ప్రాంతాల్లో ఉన్న హోటళ్లను తనిఖీ చేసి వారి వద్ద ఉన్న హెచ్‌పీ కంపెనీకి చెందిన గృహోపకరణాలకు వాడే సిలిండర్లను పట్టుకొని నవభారత్‌లోని సివిల్ సప్లై గోడౌన్‌కు తరలించారు. సంబంధిత హోటళ్ల నిర్వాహకులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చనున్నట్లు చెప్పారు.

ఆన్‌లైన్ ద్వారా ఇన్‌స్పైర్ పోటీలు : డీఈవో

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 28: 2022 విద్యాసంవత్సరంలో ఇన్‌స్పెక్టర్ మనాక్ కింద అవార్డులుగా ఎంపికైన వారు జనవరి ఒకటి నుంచి తమ ప్రాజెక్టులు ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరచారి ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో అప్‌లోడ్ చేసిన ప్రాజెక్టులు మాత్రమే పోటీకి పంపించాల్సి ఉంటుందన్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి ఇన్‌స్పైర్ మనాక్ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు 9247296012 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

సింగరేణి జీఎం ప్రసాద్‌కు పదవీ విరమణ ఆత్మీయ సన్మానం

జీఎంను సన్మానిస్తున్న డైరెక్టర్, జీఎంలు

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 28: ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న జీఎం (ఈఅండ్ఎం) స్టోర్ జీఎం ప్రసాద్‌కు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులు, సిబ్బంది గురువారం ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఅండ్ఎం విభాగంలో వివిధ ఏరియాల్లో వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం జీఎం ఈఅండ్ఎం స్టోర్స్‌గా పనిచేస్తూ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న సందర్భంగా ఆయన సేవలను అధికారులు కొనియాడారు. సింగరేణి ఉన్నతాధికారులు ఎన్‌వీకే శ్రీనివాస్, సుబ్బారావు, సుబ్బారావు, డీవీఎస్ఎస్ రాజు, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి వరకు దరఖాస్తుల స్వీకరణ

రామవరం, డిసెంబర్ 28: సింగరేణిలో సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డుల కోసం ఈ నెల 30 వరకు దరఖాస్తుల స్వీకరించనున్నట్లు కొత్తగూడెం ఏరియా పీవీకే 5 పర్సనల్ మేనేజర్ వరిపెల్లి అజయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో పదవీ విరమణ పొందిన కార్మికులకు కార్పొరేట్ వైద్యం అందించే ఉద్దేశంతో మొదలుపెట్టిన సీపీఆర్ఎంఎస్ (నాన్ ఎగ్జిక్యూటివ్) పథకంలో భాగంగా 2016 జూలై 1 కంటే ముందు పదవీ విరమణ పొందిన, మరణించిన వారి కోసం సింగరేణి యాజమాన్యం చివరిసారిగా అవకాశం కల్పించినట్లు చెప్పారు. అర్హులంటే నిర్ణీత గడువులోగా రూ.40 వేల డీడీ తీసుకొని పీవీకే5 లోని తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మణుగూరుటౌన్ : దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాయం, డీఎస్పీ, తహసీల్దార్

పర్ణశాల: దబ్బనూతులలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

టేకులపల్లి : గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

పేదల సంక్షేమానికే గ్రామసభలు

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్, డిసెంబర్ 28: పేదల సంక్షేమం కోసం ప్రతి గ్రామంలో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన గురువారం బుగ్గ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారెంటీల కోసం ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, తహసీల్దార్ రాఘవరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామసభను పరిశీలించిన ఎమ్మెల్యే తెల్లం

పర్ణశాల, డిసెంబర్ 28: మండలంలోని దబ్బనూతులు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామసభను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ పరిశీలించారు. గ్రామసభల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆరు గ్యారెంటీల అమలు దరఖాస్తులను పూర్తి చేయడంలో చాలా చోట్ల ఇబ్బంది పడ్డారనే విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఆది నారాయణ, సర్పంచ్ నాగమణి, కార్యదర్శి సురేష్, బీఆర్ఎస్ మండల కార్యదర్శి కణితి రాముడు, అధికారులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోవాలి : ఐటీడీఏ పీవో

భద్రాచలం, డిసెంబర్ 28: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా భద్రాచలం గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. జనవరి 6వ తేదీ వరకు పనిదినాల్లో జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ ప్రతి వార్డులో ప్రజాపాలన సదస్సులు నిర్వహించి ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తులను ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి అనీల్, డీఆర్‌డీఏ సీసీ సీతారాములు, ఐకేపీ ఏపీఎం జగదీశ్, ఆర్ఐ నర్సింహారావు, అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళలు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

గడపగడపకూ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు/ టేకులపల్లి, డిసెంబర్ 28 : గడపగడపకూ సంక్షేమ పథకాలు అందేవరకు కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఇల్లెందు పట్టణంలోని 1, 19, 20వ వార్డుల్లో గురువారం ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలకు సంబంధించి పథకాలను అమలు చేసేందుకు పేదల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా మిగతా సమస్యలేమైన ఉంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. టేకులపల్లి మండలంలోని చింతలంక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌రాజు, జడ్పీ సీఈవో విద్యాలత, మండల ప్రత్యేక అధికారి విజేత, ఎంపీడీవో వీర బాబు, ఏటీడీవో రూపదేవి, సర్పంచ్ భూక్యా రతన్‌లాల్, ఎంపీటీసీ భూక్యా శంకర్‌నాయక్, ఏపీఎం రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన దరఖాస్తులు

ఆరు గ్యారెంటీల కోసం పట్టణాలు, పల్లెల్లో గ్రామసభలు ప్రారంభం

ఫారంలో లేకున్నా కొత్త రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాల కోసం ప్రజల అప్లికేషన్లు

దరఖాస్తుల్లో రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, మహాలక్ష్మి పథకాలవే అధికం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారెంటీల్లో ఐదింటికి గురువారం నుంచి గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకోవాలంటూ ప్రకటించడంతో పల్లెలు, పట్టణాల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. అయితే ప్రభుత్వం చెప్పినట్లుగా గురు, శుక్రవారాల నాటి షెడ్యూల్ ఉన్న గ్రామాల్లో చాలా వరకూ దరఖాస్తుల పంపిణీ పూర్తిగా జరగలేదు. దీంతో చాలా మంది ప్రజలకు దరఖాస్తులు అందకపోవడంతో వారంతా అనేక ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు రూ.10 ఒక దరఖాస్తు ఫారం చొప్పున విక్రయించారు. 'ప్రజాపాలన అభయహస్తం' పేరిట చేపట్టిన ఈ గ్రామసభలో యువ వికాసం మినహా ఐదు గ్యారెంటీలైన మహాలక్ష్మి కింద రూ.2500 ఆర్థిక సాయానికి, రూ.500కే గ్యాస్ కనెక్షన్‌కు, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, గృహలక్ష్మి, రైతు భరోసా పథకాలకు దరఖాస్తులను ఆహ్వానించారు. కానీ, ఆ దరఖాస్తులో కొత్త రేషన్ కార్డుల విషయం ప్రస్తావించలేదు. కానీ చాలా మంది ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం కూడా అదే దరఖాస్తును సమర్పించారు. దీంతో వారిని నిరాశతో వెనక్కు పంపలేక అధికారులు వాటిని స్వీకరించారు. కాగా, అందిన దరఖాస్తుల్లో రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, మహాలక్ష్మి పథకాలవే అధికంగా ఉన్నాయి. అయితే దరఖాస్తులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం కోసం మాత్రం ఒక పట్టిక ఉంది. కానీ స్థలాలు లేని చాలా మంది ప్రజలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు సమర్పించారు. అయితే 250 గజాల ఇంటి స్థలం ఇస్తామన్న పట్టిక కేవలం అమరవీరుల కుటుంబాలకు, తెలంగాణ ఉద్యమకారులకు మాత్రమే ఉంది. కాగా, నిర్ణీత షెడ్యూల్ ఉన్న గ్రామాల్లో టీం లీడర్ల ఆధ్వర్యంలో సంబంధిత బృందాల అధికారులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ దరఖాస్తులు స్వీకరించారు. ఆయా గ్రామసభలను సంబంధిత నియోజక వర్గాల, మండలాల ప్రత్యేక అధికారులు సందర్శించి దరఖాస్తుల తీరును పరిశీలించారు. అధికారులకు, ప్రజలకు పలు సూచనలు చేశారు.

సరిగా అందని దరఖాస్తులు..

కొత్తగూడెం మున్సిపాలిటీలోని 9 వార్డుల ప్రజలకు సరిగా దరఖాస్తులు అందలేదు. మెప్మా సిబ్బంది, రిసోర్స్‌పర్సన్లు ఇంటింటికీ వెళ్లి సుమారు 5,400 దరఖాస్తులను అందించాల్సి ఉండగా.. 4000 దరఖాస్తులనే అందించగలిగారు. దీంతో దరఖాస్తు ఫారాలు అందని వారంతా ఇబ్బంది పడ్డారు. కాగా, రేషన్‌కార్డు లేని వారు కూడా గ్రామసభలకు వచ్చారు. అయితే రేషన్‌కార్డు లేకున్నా దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో వారు కూడా దరఖాస్తులు అందించి వెళ్లారు. అదీగాక కొన్ని గ్రామాల్లో ఇప్పటికే ప్రభుత్వ పథకాలు పొందుతున్న వారు కూడా మళ్లీ దరఖాస్తులు అందించారు.

– నమస్తే నెట్‌వర్క్

చర్ల: తేగడలో దరఖాస్తును తీసుకుంటున్న ఎంపీడీవో

దుమ్ముగూడెం: గ్రామసభను పరిశీలిస్తున్న ఆర్డీవో మంగీలాల్

పాల్వంచరూరల్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగరాజు

పాల్వంచలోని కరకవాగులో దరఖాస్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ అజ్మీరా స్వామి

మండలంలోని అచ్యుతాపురంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటు చేసిందన్నారు. అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని ప్రజలను కోరారు. అలాగే రామన్నగూడెంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, పాతరెడ్డిగూడెంలో ఎంపీవో సీతారామరాజు, మొద్దులమడలో ఏవో నవీన్, కేశప్పగూడెంలో ఐబీఏఈ కృష్ణ గ్రామసభలు నిర్వహించారు.

భద్రాచలం : దరఖాస్తును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్


అశ్వారావుపేట రూరల్ : దరఖాస్తు తీసుకుంటున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

పాల్వంచ : గాంధీనగర్‌లో సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

పార్టీలకు అతీతంగా అభివృద్ధి

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అశ్వారావుపేట/అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 28 : పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. గురువారం

నేరాల నియంత్రణకు కృషి

మాదక ద్రవ్యాల నిర్మూలనకు త్వరలో ప్రత్యేక బృందాలు

'వార్షిక రిపోర్టు' ప్రెస్‌మీట్‌లో భద్రాద్రి ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 28: ఏడాదిలో ఎన్నో అవాంతరాలను ఎదుర్కొని నేరాలను నియంత్రించడంలో తమ శాఖ సఫలమైందని, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా విధులు నిర్వహిస్తామని భద్రాద్రి ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు. 2023 సంవత్సరం పూర్తి కావస్తున్న నేపథ్యంలో 'వార్షిక రిపోర్ట్' వెల్లడి సందర్భంగా కొత్తగూడెంలోని తన కార్యాలయంలో గురువారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది నవంబర్ నెల వరకు జిల్లాలో మొత్తం 5,293 కేసులు రిజిస్టర్ చేశామని, 2022లో మొత్తం 5,274 కేసులు జిల్లాలో నమోదయ్యాయని తెలిపారు. నిరుటితో పోలిస్తే ఈ ఏడాది కేవలం 0.35 శాతం మాత్రమే జిల్లాలో నేరాల శాతం పెరిగిందన్నారు. చోరీలకు సంబంధించి ఈ ఏడాదిలో జిల్లాలో మొత్తం 379 కేసులు నమోదు కాగా.. మొత్తం రూ.4,27,51,847 సొత్తు అపహరణకు గురైందని వెల్లడించారు. ఇందులో 228 కేసులు ఛేదించగా అందులో ఇప్పటి వరకు రూ.1,23,33,206 విలువైన సొత్తుని రికవరీ చేశామన్నారు. అలాగే, గంజాయి, మాదక

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ డాక్టర్ వినీత్ జి

ద్రవ్యాల్లో ఈ ఏడాదిలో 73 కేసులు నమోదు కాగా, వీటిల్లో మొత్తం రూ.11,62,13,175 విలువ గల 4,734 కేజీల గంజాయిని సీజ్ చేసి 142 మందిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. నిరుటితో పోలిస్తే ఈ ఏడాది 48.4 శాతం ఈ నేరాలు పెరిగినట్లు చెప్పారు. సైబర్ నేరాలకు సంబంధించి ఈ ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 138 కేసులు నమోదు కాగా.. అపహరణకు గురైన రూ.4,76,16,190 సొత్తులో రూ.76,24,654ని ఫ్రీజ్ చేశామని, రూ.91 వేలను రికవరీ చేశామని వెల్లడించారు. అలాగే, నేరాల నియంత్రణలో భాగంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే 29 మందిపై కొత్తగా రౌడీషీట్లను తెరిచామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 232 రౌడీ షీట్లు ఉన్నాయన్నారు.

సమర్థంగా ఎన్నికల విధులు..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను జిల్లాలో తమ శాఖ సమర్థవంతంగా నిర్వహించిందని ఎస్పీ తెలిపారు. అనుమతులు లేకుండా తరులుతున్న రూ.3,61,81,100 నగదు సీజ్ చేశామని, రూ.1.91 కోట్ల విలువైన 2161.48 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే, మావోయిస్టుల చర్యలను కూడా సమర్థంగా తిప్పికొట్టామన్నారు. ఇందులో మొత్తం 43 కేసుల్లో 80 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో ఐదుగురు మావోయిస్టులు లొంగిపోయినట్లు చెప్పారు.

ఎన్నికల అధికారుల నిర్లక్ష్యంతోనే మణుగూరు ఏరియాలో ఓటమి

ఏఐటీయూసీ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య

మణుగూరుటౌన్, డిసెంబర్ 28: సింగరేణి సంస్థ గుర్తింపు సంఘం ఎన్నికల్లో మణుగూరు ఏరియాలో ఎన్నికల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఏఐటీయూసీ కేవలం 2ఓట్ల తేడాతో ఓటమిపాలైందని ఏఐటీయూసీ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య అన్నారు. ఆయన గురువారం మణుగూరు సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మణుగూరు ఏరియాలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు సింగరేణి కార్మికులను ప్రలోభాలకు గురిచేశారన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా రీకౌంటింగ్‌కు అనుమతి లేదని అధికారులు చెప్పడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ఎన్ని ఆవరోదాలు ఎదురైనా సింగరేణి వ్యాప్తంగా ఏఐటీయూసీ అత్యధిక ఓట్లు సాధించి గుర్తింపు సంఘంగా నిలవడం సంతోషకరమన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు బొల్లోజు అయోధ్యాచారి, ఏఐటీయూసీ నాయకుడు వై రాంగోపాల్ పాల్గొన్నారు.

అద్దె బస్సు యజమానుల సమస్యలు పరిష్కరించాలి

భద్రాచలం, డిసెంబర్ 28: అద్దె బస్సుల యజమానుల సమస్యలు పరిష్కరించాలని, లేనట్లయితే జనవరి 5వ తేదీ నుంచి అద్దె బస్సులను నిలిపి ఆందోళన చేస్తామని అద్దె బస్సుల యజమానులు హెచ్చరించారు. గురువారం భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ రామారావును కలసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం మహాలక్ష్మి పథకం వల్ల బస్సులలో ప్రయాణీకులు సంఖ్య పెరిగి డీజిల్ భారం అధికమవుతుందని వారు డీఎంకు తెలిపారు. బస్సుల ఇన్సూరెన్స్ కెపాసిటీ పల్లె వెలుగుకు 56, ఎక్స్‌ప్రెస్‌కు 51గా ఉందని, ప్రస్తుతం ఉచిత ప్రయాణంతో ప్రతి బస్సుకు వందమందికి పైగా ప్రయాణీకులు ప్రయాణిస్తున్నారని, దీంతో ఓవర్ లోడ్ పెరిగి ఇన్సూరెన్స్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అశ్వారావుపేట, డిసెంబర్ 28: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన చప్పిడి ముత్యాలు (35) బుధవారం రాత్రి 11 గంటలకు ద్విచక్ర వాహనంపై నారాయణపురం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి వంతెనను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ఖమ్మం ఆసుపత్రికి సిఫార్సు చేశారు. అక్కడ కూడా పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు హైద్రాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగులు సక్రమంగా పనిచేయాలి

ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

చర్ల, డిసెంబరు 28: ప్రభుత్వ ఉద్యోగులు సక్రమంగా పనిచేస్తే పరిపాలన సవ్యంగా సాగుతుందని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం చర్ల శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పెన్షనర్స్‌డే సమావేశంలో ఆయన మట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు వెంకట్రావును సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

చర్లలో మృతిచెందిన పలు కుటుంబాలను వెంకట్రావు పరామర్శించారు. జర్నలిస్టు ప్రభుదాసు సతీమణి వసంత, సత్యనారాయణపురం గ్రామానికి చెందిన రాజకీయ నాయకుడు లంకా వెంకట్ కుటుంబాలను పరామర్శ